# శీలం ఖరీదు

"ఈ క్షణాలు శాశ్వతమైపోతే బాగుంటుంది కదూ!" ఆమె గుసగుసగా అతని చెవుల్లో పలికింది.

"రేఖా! ఇట్లా నా దగ్గరగా రా-ఇంకా.... ఓహ్- నాకేమనిపిస్తోందో తెలుసా?"

"ఊఁ...." పరవశంగా అంది రేఖ.

"మన ఎడబాటు నేనెక్కువ రోజులు భరించలేను. ఏ దూర తీరాలకో, వీళ్ళందరికి దూరంగా పోయి తనివితీరా, తృప్తితీరా ఒకరి కొకరంగా బతికి ఒకటిగా మరణిస్తే...." రేఖ చెయ్యి సుందర్ చేతిలో నలిగిపోతోంది.

"అబ్బా- సుందర్! ఇంత మంచి సమయంలో చావు గురించి మాట్లాడ్తావేం- నాకైతే భవిష్యత్తంతా నందనవనంలా కన్పిస్తున్నది. మన ఇల్లు, మన పిల్లలు, మన జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలి...."

"ఏమండోయ్ శ్రీమతిగారూ! మరీ అంతగా కలల్లో తేలిపోతే కష్టం...."

"నాకు కలల్లోంచి బయటకు రావాలని లేదు! సుందర్ – ఈ వెన్నెల, ఈ ఏకాంతం, దూరంగా ఆ సముద్రం– నీతో కలిసి ఉన్న ఈ కల కరిగిపోతుందేమోనని భయంగా ఉంది.... సుందర్! ఎప్పుడూ, ఏ పరిస్థితిలోనూ– జీవితాంతం వరకు నా చెయ్యి వదిలి పెట్టవు కదూ!...."

X X X X

"సుందర్! ఇంత సేపటికా నువ్వొచ్చేది?" ఆమె కళ్ళల్లో అలక, అతని కోసం ఇంత సేపూ నిరీక్షించిన ఆవేదనా– క్రమంగా అన్నీ తొలగిపోయి కళ్ళల్లో సన్నటి నీటిపొర.... ఆమె గద్గదంగా "సుందర్"– అంది.

"ఏమిటి రేఖా! నువ్వు మరీ ఇంత సెన్సిటివ్ అయితే చాలా కష్టమే–అనుకున్నదానికి అరగంటేకదా ఆలస్యం–బస్ దొరకలేదు...." ఆమె చెయ్యి తన చెక్కిలికి ఆనించుకుంటూ అన్నాడు సుందర్.

"అరగంట కాదు సుందర్– అరక్షణం కూడా భరించలేక పోతున్నాను. ఈ మధ్య నీ ధ్యాస మరీ ఎక్కువైపోయింది...." రేఖ అతని భుజంమీద వాలిపోయింది.

"పిచ్చి రేఖా! ఇంకెంత కాలం? రేపు శుభలేఖలు కూడా వచ్చేస్తున్నై. సరిగ్గా పదిహేను రోజులు" అనునయంగా అన్నాడు సుందర్.

మౌనంగా అతని స్పర్శలో భావి జీవితాన్ని మధురంగా ఊహించుకుంటోంది రేఖ— నిశాకాంత నీడలు పరుచుకునే సమయం— లేచారిద్దరూ ఏకాంతాన్ని వదలి.

X X X X

"నీకప్పుడే పెళ్ళి కళ వచ్చేసిందోయ్" కన్నుల పండువుగా ఉన్న రేఖను చూస్తూనే అన్నాడు సుందర్. ఎరుపు రంగు జార్జెట్ చీర ఒంటి రంగుతో పోటీపడ్తూ మెరిసిపోతున్న రేఖను ఆప్యాయంగా, అనురాగంగా చూస్తూ అన్నాడు సుందర్.

ఆమె కళ్ళు సిగ్గు బరువుతో వాలిపోయినై. అతని హృదయంలో మొహాన్ని దాచేసుకుంది రేఖ. ఇద్దరూ ఏదో లోకంలో—ఈ లోకానికి అతీతంగా....

హఠాత్తుగా పక్కనే పెద్ద ఉరుము. ఉలిక్కిపడి విడివడ్డారిద్దరూ. అయినా సుందర్ రేఖ చేతిని వదిలిపెట్టలేదు. ఎవరో ఇద్దరు బలిష్ఠమైన వ్యక్తులు— చెరొకరి రెక్క పట్టుకుని ఒక్కసారిగా లాగారు.

భయంతో కెవ్వుమంది రేఖ.

గుండెలయ తప్పినట్లైందామెకు—

గింజుకుంది— గట్టిగా చెయ్యి కొరికింది. కానీ ఆ వ్యక్తి ఇసుమంతైనా పట్టు సడలించలేదు.

అనాదిగా అబల అనిపించుకుంటున్న ఆడది— తాను అబలనే అని నిరూపిస్తున్నట్లుగా తన ప్రయత్నం వృధా కాగా, నిస్సత్తువగా, పువ్వులా ఒక పశువు చేతిలో నలిగి వాలిపోయింది రేఖ.

తన రేఖను రక్షించుకోవాలనే ఆరాటంతో, ఆవేశంతో అటు సుందర్ తనతో తలపడిన వ్యక్తిని ప్రతిఘటించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. మొదటి వ్యక్తి తన పని ముగించుకోగానే రెండో వ్యక్తికి రేఖను ఒప్పగించి సుందర్‌ని తాను ఒడిసి పట్టుకున్నాడు.

తన భవిష్యత్తు నాశనం చెయ్యొద్దన్న రేఖ వేడికోలూ, రేఖను రక్షించాలన్న సుందర్ తీవ్రమైన ప్రయత్నం— అన్నీ వ్యర్థం కాగా అతని కళ్ళ ముందే రేఖను నిర్దాక్షిణ్యంగా అనుభవించారా రాక్షసులు.

భూమి పగిలిపోయి తానందులోకి వెళ్ళకుండా ఇంకా సుందర్ ఎదురుగా ఉన్నందుకు సిగ్గుగా ఉందామెకు. ఎరుపు జార్జెట్‌లో మెరిసే అందంతో అక్కడికి అడుగుపెట్టిన రేఖ ఇప్పుడు అక్కడక్కడా చిరిగిన చీర, జాకెట్— రేగిన జుట్టులో వికృతంగా తయారైంది. నిర్మానుష్యంగా, ఏకాంతాన్ని వరంగా ప్రసాదించిన ఆ స్థలం ఇప్పుడు భయంకరంగా పరిహసిస్తున్నది. పని ముగించుకున్న కిరాతకులు— తమ క్షణికానందాన్ని అనుభవించడం కోసం ఒక ఆడదాని భవిష్యత్తు సర్వనాశనం చేసిన ఘనులు అప్పుడు పారిపోయినారు.

నిస్సహాయంగా, స్తబ్దంగా జరిగింది కళ్ళారా చూస్తున్న సుందర్ మనస్థితి వర్ణనాతీతం.

సుందర్ కోసం పవిత్రంగా అర్పితం కావలసిన శీలం పోయింది. చావే శరణ్యమా? కానీ తనది ఇందులో తప్పు ఎంతవరకు? నిస్సహాయ పరిస్థితులలో కదా వాళ్ళకి లొంగిపోయింది_ ఎదురుగా ఉండే సుందర్ కూడా ఏమీ చేయలేక పోయాడు. మనస్సును, శరీరాన్ని దహించి వేస్తున్న ఈ బాధకు ఉపశమనంగా సుందర్ తనను దరిచేర్చి ఓదారుస్తాడనీ, కన్నీటితో కొంతైనా తన ఆవేదనను కరిగించుకుందామనీ ఆశిస్తూ బెరుకుగానే అతనివైపు చూసింది రేఖ. జాలువారుతున్న కన్నీటి మధ్యగా. అతను ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"చీర సవరించుకో"_ అన్నాడు.

ఇన్నాళ్ళూ ఆత్మీయత, అనురాగం తనతో కలిసి పంచుకున్న సుందరేనా_ ఒక్క క్షణం బాధతో హృదయం రెపరెపలాడింది.

ఆమె సలిగిపోయి లేవలేక అవస్థ పడుతున్నా చూసి చూడనట్లు ఊరుకున్నాడు. కొంత దూరం నడిచివెళ్ళి ఆటో తీసుకువచ్చి ఆమెను ఎక్కమని, తనూ ఓ పక్కకి కూర్చుని రేఖను ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోయాడు.

X X X X

"సుందర్ ఇది చాలా అన్యాయం- నీ ప్రేమ, అనురాగం- అంతా నాటకమేనా?...." ఆవేశంగా అంది రేఖ.

"రేఖా! అనవసరంగా ఆవేశపడకు। ఇది నువ్వనుకునేంత చిన్న విషయం కాదు. జీవిత సమస్య- నువ్వే ఆలోచించు."

"నీ కళ్ళముందే ఇది జరుగుతుంటే నువ్వెందుకు నన్ను రక్షించ లేకపోయావ్?"

"వాళ్ళ బలం ఎక్కువ- నేనేం చెయ్యగలను?"

"నాకిష్టం లేకుండా వాళ్ళు నన్ను అనుభవించినప్పుడు ఆ తప్పుకు నా బాధ్యత ఎంత వుంది? నా మనసు నీకు తెలుసుకదా సుందర్. ఆనాడు జరిగిన సంఘటన మా ఇంట్లో ఎవరికీ తెలియదు. నేను చెప్ప లేదు. వాళ్ళను అనవసరంగా బాధ పెట్టడం నాకిష్టం లేదు. మన పెళ్ళి జరగదని ఇప్పుడు తెలిస్తే అమ్మ, నాన్న ఏమైపోతారో.... సుందర్! ప్లీజ్ ఇంకొక్కసారి ఆలోచించు.... మన కలలన్నీ మట్టుపెట్టకు.... తన ఆవేదనను వెల్లడించి, బతిమాలే ధోరణిలో అంది రేఖ.

సుందర్ చలించలేదు. శిలలాగా నుంచున్నాడు. "నిన్ను వాళ్ళు అనుభవించిన్నాడే మన కలలు సమాధి అయినై. ఇక మిగిలింది శూన్యమే, నన్ను మర్చిపో రేఖా!".... గుడ్ బై....

"సుందర్"- ఆమె నిస్సత్తువగా కూలిపోయింది. వెళ్తున్న సుందర్‌తో అంది, "రేపు సాయంత్రం వరకు నీ మనసుమారితే ఒకసారి కనిపించు సుందర్- లేకపోతే ఈ రేఖ నీకిక కనిపించదు"

అతను వెళ్ళిపోయాడు.

X X X

రేఖ హృదయం భారంగా ఉంది. మలినమైన శరీరాన్ని సుందర్‌కి అర్పించాలని లేదు. కాని ప్రేమ విలువ ఇంతేనా- ఇన్నాళ్లా

తనకీ సుందర్‌కీ మధ్య జరిగింది నాటకమేనా? పెళ్ళికింకా పది రోజులే టైముంది. శుభలేఖలు కూడా పంచడం మొదలు పెట్టారు. తమ కుటుంబం ఎంత అభాసు పాలవుతుందో-జరిగింది ఇంట్లో చెప్పాలని లేదు. మనసు అస్తవ్యస్తంగా తయారయింది. ఏ విషయమైనా సన్నిహితులతో చెప్పుకుంటే మనస్సు తేలిక పడ్తుంది. కాని ఇటువంటి పరిస్థితి ఎవరితో చెప్పుకోగలదు''

తల్లి కమలమ్మ అడిగింది,. ''ఏమిటే అట్లా వున్నావు?'' అని రేఖ మాట్లాడలేదు. ఆవేళ తను ఇంటికి వచ్చేసరికి అదృష్టవశాత్తు ఇంట్లో ఎవరూ లేరు. ఇంటికొచ్చి స్నానం చేసి బట్టలు మార్చుకుంది.

నిర్లిప్తంగా ఉంటున్న రేఖ వైఖరి తల్లి కర్థం కాలేదు. నిజానికి జరిగిన విషయం సుందర్‌కి, తనకూ తప్ప ఎవరికీ తెలియదు. సుందర్ సహకరిస్తే ఇది తామిద్దరి మధ్యే ఉంటుంది. ఆ విశాల హృదయం అతనికి ఉంటుంది- అనుకుందే కాని మగ జాతికి అతనూ ప్రతీక అని ఇంకా అనుకోలేక పోతూంది. బహుశః అతని పట్ల ఉన్న గాఢానురక్తి అట్లా అనుకునేట్లు చేస్తోందేమో, అయినా తను చేసుకుంటే సుందర్‌నే చేసుకుంటుంది. అతనితోనే తన జీవితం- కానిరోజు అంతా శూన్యమే. తన ఎడబాటే సహించలేను అన్న సుందరే ఇంతగా మారిపోయినాడంటే....

ఆలోచనల్లో టైమ్‌కూడా గుర్తించే స్థితిలో లేదు రేఖ. కాబోయే పెళ్ళికూతురివి. ఈ అవతారమేమిటి? పొద్దుట్నుంచి అన్నం తినకుండా కడుపు మాడ్చుకోవడమేమిటి?- అసలు నీ తరహాసే అర్థం

క్షాపడం లేదు. తల్లి మందలింపుతో ఈ లోకంలోకి వచ్చింది. అసలు ఆకలి అనే మాట మర్చిపోయింది.

"టైమెంతయిందమ్మా"- అంది యథాలాపంగా.

"అయిదు గంటలు దాటుతోందే. కాస్త మొహమన్నా కడుక్కురా వేడిగా టిఫిన్ తిందువుగాని....."

ఉలిక్కి పడింది రేఖ. మనస్సు మార్చుకుంటే సుందర్ ఈ పాటికి రావాల్సింది- ఆలోచనల మధ్యలోనే ఉత్సాహం తెచ్చుకుని టిఫిన్ తిని కూర్చునుండగా అడిగింది కమలమ్మ "ఇవాళ సుందర్ రాలేదేం" అని. మాట్లాడలేదు రేఖ.

రేఖను ఆ నరరూప రాక్షసులు పాడు చేసిన క్షణం నుంచి సంఘర్షణ మొదలైంది. తన కళ్ళముందే పరాయి వాడనుభవించిన రేఖను తన జీవిత భాగస్వామినిగా చేసుకోవడమా- ఆ తలంపే చేదుగా విషతుల్యంగా ఉంది. ఇన్నాళ్ళూ కళ్ళకు దేవతలా కనిపించిన రేఖ ఇప్పుడు దయ్యం లాగా కనపడుతున్నది. ఆమెను పెళ్ళి చేసుకొని కాపురం చెయ్యడం అసంభవం. త్యాగ బుద్ధితో ఆమెను చేపట్టినా అనుక్షణం ఆమె పతిత అన్న విషయం గుర్తొస్తూనే ఉంటుంది.... తను చేసుకోడు గాక చేసుకోడు.

తాము కలిసి తిరిగిన మధుర స్మృతులు, చేసుకున్న బాసలు, ఆదర్శంగా జీవించాలన్న ఆశయాలు- అన్ని కన్నులముందు నిలిచి కలవర పెడ్తున్న రేఖకు తాను ఇచ్చే విలువ ఇంతేనా?

తన ఆలోచనల్లో లోపముందా లేక తాము బ్రతుకుతున్న ఈ వ్యవస్థలో లోపముందా? అసలు శీలమంటే ఏమిటి?

ఆమె నిమిత్తం లేకుండా బలవంతంగా జరిగిన దానికి ఆమె బాధ్యురాలెట్లా అవుతుంది? నీది నిజమైన ప్రేమ అయితే, ఆమెను తప్పక స్వీకరించాలి,– మనస్సు మూరుమూలల నుంచి ఏదో సంస్కారం హెచ్చరిస్తోంది.

'కాని చెడిపోయిన దాన్ని చేసుకోవద్ద'ని గొంతు చించుకొని అరుస్తున్న అంతరాత్మ చెవులకు ఆ హెచ్చరిక అసలు వినిపించలేదు. సంధ్య ఛాయలు పరుచుకుంటున్నా ఆలోచనలు తెగనే లేదు. అలసి పోయిన మనస్సునూ, శరీరాన్ని నిద్రాదేవి మెల్లగా లాలించింది.

..ఎంత సేపు నిద్ర పట్టిందో కాని హఠాత్తుగా మెలుకువ వచ్చింది సుందర్‌కి. లేచి టైమ్ చూస్తే రాత్రి ఒంటి గంట చూపిస్తోంది గడియారం– ఏ ఏడెనిమిది గంటలకో పట్టిన నిద్ర....

ఆలోచనల వరుస మళ్ళీ కొనసాగింది. "తన మానవత్వమింతేనా– ఇంత సంకుచితంగా ఆలోచిస్తున్నది తనేనా? రేఖ ఎంత అమాయకురాలో, అంతకుమించి తన నెంతగా ప్రేమిస్తుందో తన అంతరాత్మకు తెలుసు. తాను మాట్లాడిన తీరుకు ఆ వేళ ఎంత బాధకులోనైందో రేఖ. మనసు మార్చుకుంటే సాయంత్రం రమ్మంది, తను వెళ్ళనే లేదు. ఎంత పొరపాటు చేశాడు. ఎంత ఆవేదన పడిందో పాపం. "ఇప్పుడు వెళ్తేనో....!" అర్ధ రాత్రి పరాయి ఆడపిల్ల ఇంటికి

పోవడం బాగుండదు- "కాబోయే భార్యేకదా! వెళ్తే ఏమవుతుంది...." అటు కాసేపు, ఇటు కాసేపు ఆలోచిస్తూ అశాంతిగా నిమిషాలు దొర్లిస్తున్నాడు సుందర్. అసలు తెల్లవారుతుందా అనిపిస్తోంది.

.... ఐదు గంటలవ్వగానే త్వరగా స్నానం చేసి రేఖ ఇంటివైపు నడిచాడు. ఇంకా వెలుగు రేకలు విచ్చుకోక ముందే తలుపు తడుతున్నదెవరా అని తెరచి చూసిన కమలమ్మ ఎదురుగా ఉన్న కాబోయే అల్లుణ్ణి చూసి తనలో తను నవ్వుకుంది. "రేఖ ఇంకా లేవలేదు బాబూ! కూర్చో లేపుతాను...." అంది లోపలికి వెళుతూ.

ఆవిడ రేఖను రెండు మూడు సార్లు పిల్చినా జవాబు లేదు. కదలికే లేదు. రేఖ సాధారణంగా ఒకసారి పిలిస్తేనే లేస్తుంది. అట్లాంటిది- లేవదేం- అనుకుంటూ ఈసారి తట్టి లేపింది. చల్లగా తగిలిన రేఖ చెయ్యి చూసి కెవ్వున కేక పెట్టింది.

సుందర్‌కి ఒక్క క్షణం ఊపిరి ఆగిపోయినట్లైంది. గుండెలు దడ దడ కొట్టుకుంటున్నాయి. కొంపదీసి రేఖ ఏదైనా అఘాయిత్యం తలపెట్టలేదు కదా! అతనికి అడుగు ముందుకు వెయ్యడానికి కూడా సాహసం చాలడం లేదు.

కమలమ్మ పెట్టిన కేకకి నిద్రమత్తు వదిలి అందరూ లేచి వచ్చారు.

అచేతనంగా పడిఉన్న రేఖ ప్రాణాలప్పటికే అనంత వాయువుల్లో కలిసిపోయినై.

"నా చావుకి నేనే బాధ్యురాల్ని"- అన్న స్లిప్ తప్ప రేఖ ఎందుకు చచ్చిపోయిందో తెలిపే ఆధారాలేమి మిగల్చలేదు. ఆమె చావు అందరికీ షాక్. తల్లీ, తండ్రి గుండెలు బాదుకుంటున్నారు. చెల్లెలు, తమ్ముడూ కంటికి, మంటికీ ఏకధారగా ఏడుస్తున్నారు.

మౌనంగా కళ్ళ నీళ్ళు వదలడం తప్ప ఏం చెయ్యాలో తెలియకుండా నిల్చుండి పోయాడు సుందర్. మెదడు మొద్దుబారి నట్లుంది. ఆమె తొందర పడి ముందు వెళ్ళిపోయిందో, తాను ఆలస్యంగా కళ్ళు తెరిచాడో అర్థం కాక నిశ్చలంగా రేఖనే చూస్తుండిపోయాడు- శిలం ఖరీదు రేఖ ప్రాణమా?

"అబ్బా- సుందర్- ఇంత మంచి సమయంలో చావు గురించి మాట్లాడతావేం- నాకైతే భవిష్యత్తంతా నందనవనంలా కనిపిస్తోంది. మన ఇల్లు- మన పిల్లలు- మన జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలి...." చుట్టూ జరిగే గందరగోళం ఏమీ తెలియడం లేదు సుందర్‌కి. కేవలం ఆమె మాటలే చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే రాయిలా నుంచున్నాడు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 1-11-'85)